సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

● పార్టీలకతీతంగా పట్టణ అభివృద్ధి చేద్దామన్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పార్టీలకతీతంగా పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. శనివారం కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సిల్‌కు ఆరునెలల గడువు మాత్రమే మిగిలి ఉన్నందున మౌలిక వసతులపైనే దృష్టి పెడతామన్నారు. అందుకు అందరి సహకారం తీసుకుంటామన్నారు. తాజాగా టీయూఎఫ్ఐడీసీ నుంచి మంజూరైన రూ.37.87 కోట్లతో ఆయా వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామన్నారు. వీటికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపడతామన్నారు.

పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటి బారిన పడి పలువురు గాయాల పాలవుతున్నారని కౌన్సిలర్లు కట్టా రవికిషన్‌రెడ్డి, తాటి గణేష్ కుమార్, ఎన్.శ్రీనివాసులు, కిషోర్‌కుమార్, రామలక్ష్మణ్, వి.మోతీలాల్, సి.గోవిందు, ముస్కాన్‌సుల్తానా, మోయిన్‌అలీ, రామాంజనేయులు, జాజిమొగ్గ నర్సింహులు తదితరులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రత్యేక బృందం వీటిని పట్టుకుని మౌలాలిగుట్ట వద్ద ఉన్న జంతు సంరక్షణ కేంద్రానికి తరలించి వ్యాక్సినేషన్ చేసిన అనంతరం ఎక్కడికక్కడే వదిలివేయడంతో సమస్య మళ్లీ మొదటికి వస్తోందన్నారు. అలాగే వీధి లైట్ల ఏర్పాటులో ఏజెన్సీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. చాలా ప్రాంతాల్లో మూడో వైరు ఏర్పాటు చేయకపోవడంతో 24 గంటలు లైట్లు వెలుగుతున్నాయన్నారు. మరికొన్ని చోట్ల అసలు వీధి దీపాలే లేవన్నారు. ఇటీవల ఎండాకాలంలో తనకు సమాచారం ఇవ్వకుండా వార్డులో అధికారులు మూడు పవర్‌బోర్లు ఏర్పాటు చేశారని 20వ వార్డు కౌన్సిలర్ రావుల అనంతరెడ్డి (బీఆర్ఎస్) ఆరోపించారు. కొన్ని వార్డుల్లో ఎక్కువగా ఈ బోర్లు వేయడం ఎంతవరకు సమంజమన్నారు. ఈ విషయంపై 24, 32వ వార్డు కౌన్సిలర్లు మహమ్మద్ అబ్దుల్‌రషీద్, సాదతుల్లా (ఎంఐఎం) అభ్యంతరం వ్యక్తం చేయగా మరికొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అడ్డుతగిలారు. ఈ అంశంపై కొద్దిసేపు వాగ్వాదం నడిచింది. చివరకు చైర్మన్‌తో పాటు కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. మున్సిపాలిటీ లో సాధారణ నిధులు తక్కువగా ఉన్నందున అన్నపూర్ణ పథకాన్ని నిలిపివేయాలని కౌన్సిలర్ సాదతుల్లా కోరారు. ఏజెన్సీ నిర్వాహకులకు ప్లేటు భోజనానికి రూ.35 చొప్పున చెల్లించడం తగదన్నారు. ఇక ఇంటింటికీ వెళ్లి తాగునీటి పరీక్షలు చేసేందుకు మహిళా సంఘాలకు అప్పగించవద్దన్నారు. ప్రభుత్వం గుర్తించిన ఏజెన్సీలతోనే ఈ పని చేయించాలన్నారు. క్లాక్‌టవర్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు రోడ్డు అధ్వానంగా తయారైందని వెంటనే బాగు చేయించాలని ఆయనతో పాటు 29వ వార్డు కౌన్సిలర్ మోయిన్ అలీ విజ్ఞప్తి చేశారు. సమావేశం అజెండా కాపీలను ఉర్దూ భాషలోనూ ముద్రించాలని కోరారు. జడ్చర్ల – రాయిచూర్ మెయిన్ రోడ్డు వెంట నాలుగు చక్రాల బండ్లపై పండ్లు అమ్ముకునే వీధి వ్యాపారులకు శాశ్వత ప్రాతిపదికన ఒకచోట షెడ్డు ఏర్పాటు చేయాలన్నారు. మిషన్ భగీరథ పథకం నుంచి వారంలో రెండు సార్లు మాత్రమే తాగునీరు సరఫరా అవుతోందని సభ్యులందరూ ముక్తకంఠంతో సభ దృష్టికి తెచ్చారు. అదికూడా చాలా చోట్ల బురద కలిసి కలుషితమవుతోందని, ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పైపులైన్‌లో లీకేజీలను ఎప్పటికప్పుడు సరి చేయాలన్నారు. పట్టణంలో ఎక్కడబడితే అక్కడ మేకలు, గొర్రెలను కోసి మటన్ అమ్ముతున్నారని 39వ వార్డు కౌన్సిలర్ బి.రమాదేవి వాపోయారు. చికెన్, మటన్ అమ్మేవారిపై అధికారుల నియంత్రణ లేకుండా పోయిందన్నారు. మున్సిపాలిటీ ముద్ర లేకుండా విక్రయించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇక 2017 నుంచి పారిశుద్ధ్య నిర్వహణను ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించడం తగదన్నారు. అలాగే ఏటా ఖరీఫ్, యాసంగిలో ధాన్యం కొనుగోలు బాధ్యతను నవభారత్ మహిళా సమాఖ్యకే ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. దీనివల్ల మిగతా మహిళా సంఘాలకు ఫలితం దక్కడం లేదన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ఏఎంసీ జె.పవన్ కుమార్, ఎంఈ యు.బస్వరాజ్, డీఈఈలు బెంజిమన్, యూనుస్, టీపీఓ లక్ష్మీపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం, వజ్ర కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్యం - మార్గాలు


డాక్టర్ ప్రతిభ
MBBS, DNB, MRCOG(LONDON, UK)
MNAMS, DRM (Germany)
PGA (Assisted Reproductive Technology UK)
సుశ్రుత టెస్ట్‌ట్యూబ్ బేబి సెంటర్
న్యూటౌన్, మహబూబ్‌నగర్, సెల్: 9866457501

మాతృత్వం ఒక మధురానుభూతి. ప్రతి స్త్రీ తాను తల్లినవ్వాలని, అమ్మ అని పిలిపించుకోవాలని కోరుకుంటుంది. మాతృత్వం లేని వారి వేదన మాటల్లో వర్ణించలేం.

● సంతాన సాఫల్య శాతం ఎలా ఉంది ?
వివాహిత దంపతులు రోజు దాంపత్యంలో పాల్గొన్నప్పటికి. 20 శాతం మాత్రమే ప్రతి నెల గర్భం దాల్చగలరు. ఒక సంవత్సర కాలంలో ఇటువంటి దంపతులు 80 శాతం మంది సంతానం పొందగలరు.

● ఎటువంటి దంపతులు సంతానం కోసం వైద్యులను సంప్రదించాలి ?
ఏ విధమైన గర్భనిరోధక చర్యలు పాటించకుండా దాంపత్యంలో పాల్గొన్న దంపతులు ఒక సంవత్సరం దాటినా సంతానం కలగకపోతే, వారికి ప్రాథమిక సంతానలేమి ఉన్నట్లుగా గుర్తించాలి.

● సంతానం కలగకపోవడానికి గల కారణాలు వివరిస్తారా ?
నూటికి 40 శాతం మహిళలలో ఏదో ఒక సమస్యవల్ల గర్భాధారణ జరగడం లేదని గుర్తించడం జరిగింది. పురుషులలో సమస్యలవల్ల (ఇంద్రియ లోపాలు, వ్యంధత్వము మొదలగునవి) 40 శాతం దంపతులకు గర్భాదారణ జరగడం లేదు. ఒక 20 శాతం దంపతులలో ఇరువురిలో ఏదో ఒక సమస్య ఉండటం వల్ల గర్భాదారణ కష్టమవుతుంది.

● స్త్రీలలో ఏ సమస్యల వల్ల గర్భాదారణ కావడం లేదు ?
అండోత్పత్తిలో లోపాలవల్ల 30 శాతం మంది మహిళలు సంతానానికి నోచుకోవడం లేదు. మరికొంతమంది స్త్రీలలో ఫెలోపియన్ ట్యూబు మూసుకోవడం వల్లగాని, గర్భసంచిలో ఫైబ్రాయిడ్‌ల వల్ల గాని, గర్భసంచిలోపల పొర ఉండటం వల్ల గాని, గర్భం ధరించడం సాధ్యం కావడం లేదు.

● పురుషులలో ఉండే సమస్యలను వివరిస్తారా ?
పురుషులలో వీర్యకణాలకు సంబంధించిన సమస్యలు సాధారణంగా చూస్తూ ఉంటాం. ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకారం పురుషుని ఇంద్రియ పరీక్ష చేసినప్పుడు ఒక మిల్లీ లీటర్ ఇంద్రియంలో కనీసం 16 మిలియన్ కణాలు ఉండాలి. ఇంద్రియ లోపం సంతానం లేమికి ప్రధాన కారణం.

● దంపతులలో సంతానలేమికి అందుబాటులో ఉన్న చికిత్సలు ఏమిటి ?
దంపతులకు ఉన్న సమస్య నిర్ధారణ అయిన తర్వాత, దానికి సంబంధించిన చికిత్స నిర్ణయిస్తాము. IUI, IVF మనకు అందుబాటులో ఉన్న రెండు ముఖ్యమైన ప్రక్రియలు.

క్లుప్తంగా

‘రిషి’ విద్యార్థుల ప్రతిభ

పాలమూరు : జిల్లా కేంద్రంలోని రిషి స్కూల్ విద్యార్థులు ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబర్చారు. 10వ తరగతి విద్యార్థిని ప్రతిభ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు, 7వ తరగతి ఆకాంక్ష 5వ ర్యాంకు, 9వ తరగతి దివ్య 10వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో డైరెక్టర్ చంద్రకళ వెంకటయ్య, పూజితా మోహన్‌రెడ్డి, శిరీష ప్రవీణ్, సుశాంత్ కృష్ణ, పలువురు పాల్గొన్నారు.

గ్రూప్స్ పోస్టులు పెంచాలి

పాలమూరు: ప్రభుత్వం గ్రూప్–1, 2 పోస్టులను పెంచాలని కోరుతూ బీఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పీయూలోని లైబ్రరీ వద్ద నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఓయూ ఐకాసా నాయకులు మోతీలాల్ ఆమరణ నిరాహార దీక్ష పూనుకున్నారని, ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. డీఎస్సీలో సైతం 30 వేల పోస్టులు భర్తీచేయాలని కోరారు. కార్యక్రమంలో ర మేష్, సింగోటం, చైతన్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటనల ఖర్చు రూ.2.62 లక్షలు

జడ్చర్ల: మున్సిపాలిటీ కార్యాలయానికి సంబంధించి ఇచ్చిన పత్రికా ప్రకటనల ఖర్చు రూ.2.62 లక్షలుగా అధికారులు పేర్కొనడంతో పట్టణ వాసులు, పాలక మండలి సభ్యులు నివ్వెర పోవాల్సి వచ్చింది. శనివారం సర్వసభ్య సమావేశంలో సభ్యులకు ఎజెండా ప్రతులను అందజేయగా ప్రకటనల ఖర్చు తీర్మానం ఆమోదం కోసం అంశంగా చేర్చారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ ఖర్చును విడుదల చేసేందుకు చర్యలు చేపట్టారు. ఖర్చును చూసిన సభ్యులు విలేకరుల దృష్టికి తేవడంతో విషయం బయటకు పొక్కింది. అయితే పెద్దగా పేరు కూడా తెలియని అచ్చు వేయని ఓ పత్రికకు ఏకంగా రూ.2.11 లక్షలుగా కేటాయించడంపై సోషల్‌మీడియాలో పట్టణ వాసులు మండిపడుతున్నారు. తాము కట్టిన పన్నులను దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక ఎవరు ఉన్నారో బహిరంగ పర్చాలని డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాగర్‌కర్నూల్‌లో అత్యధికం.. నారాయణపేటలో అత్యల్పం

● ధరణి పెండింగ్ దరఖాస్తుల వివరాలు వెల్లడించిన ప్రభుత్వం

సాక్షి, నాగర్‌కర్నూల్: ధరణి పోర్టల్‌లో ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న దరఖాస్తుల వివరాలను జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం శనివారం వెల్లడించింది. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 9,178.. అత్యల్పంగా నారాయణపేట జిల్లాలో 2,258 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్లు, ఆర్డీఓ, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ స్థాయిల్లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

జిల్లాల వారీగా ఇలా..

జిల్లా	పెండింగ్ దరఖాస్తులు
నాగర్‌కర్నూల్	9,178
మహబూబ్‌నగర్	4,194
వనపర్తి	3,956
జోగులాంబ గద్వాల	3,553
నారాయణపేట	2,258

డాక్టరేట్ సాధించిన పేట విద్యార్థిని

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియాకు చెందిన దివంగత న్యాయవాది మద్దూరు బస్వరాజు కుమార్తె స్వాతి డాక్టరేట్ సాధించారు. హైదారాబాద్ ఉస్మానియా యునివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ శివరాజ్ వద్ద కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్‌పై ప్రావీణ్యత సాధించారు. ఈ మేరకు హైదారాబాద్‌లో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈమేరకు పలువురు అభినందించారు.

భూదాన్ భూమిని పరిరక్షించాలి


మాట్లాడుతున్న బాలవర్ధన్‌గౌడ్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 138 సర్వే నంబరులో ఉన్న భూదాన్ భూమి 2 ఎకరాల 10 గుంటలను పరిరక్షించాలని బీజేపీ అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సంబంధిత భూమిని సందర్శించి వివరాలను విలేకరులకు తెలియజేశారు. దివంగత మాజీ ఎమ్మెల్యే కొత్తకేశవులు ఈ భూమిని సీలింగ్ కింద భూదాన్‌కు అప్పగించారని తెలిపారు. అయితే అట్టి భూమి 2023 వరకు సీలింగ్ కింద కలెక్టర్ ప్రకటించారన్నారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 1న సీలింగ్ నుంచి తప్పించారని ఆరోపించారు. ఈ విషయంలో అధికారపార్టీ నేతల ప్రమేయం ఉండవచ్చన్నారు. అయితే 138 సర్వేనంబర్‌లో ఉన్న పట్టాభూమి 14ఎకరాలు సీలింగ్‌లో చూయించారన్నారు. సదరు భూమిలో 9ఎకరాలు ఇప్పటికే రియల్ వెంచరుగా మారగా 150 మంది ప్లాట్లు కొనుగోలు చేశారని వివరించారు. ప్రస్తుత ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సైతం 800 గజాల స్థలం ఇదే సర్వేనంబరులో కొనుగోలు చేశారన్నారు. ఆయన కొనుగోలు చేసిన స్థలం సైతం సీలింగ్‌లోకి వెళ్లిందని, వాస్తవంగా భూదాన్ భూమి సీలింగ్‌లో ఉండాల్సి ఉండగా పట్టాభూమిని సీలింగ్‌లోకి మార్చటం వెనక ఎవరి హస్తం ఉందో విచారించాలని డిమాండ్ చేశారు. పట్టాభూమికి ఎన్ఓసీ ఇచ్చి ప్లాట్లుగా మార్చాక ఇప్పుడు సీలింగ్‌లోకి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. భూదాన్ భూమిని మాయం చేసేందుకు సీలింగ్ నుంచి ఎత్తివేసి పట్టా భూమిని సీలింగ్‌లోకి తీసుకురావటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మహమ్మదాబాద్: మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామానికి నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైన నేపథ్యంలో శనివారం అధికారుల ఆదేశాల మేరకు సర్వేయర్ గోపాల్ స్థలపరిశీలన చేశారు. సర్వే నంబర్ 70, 252లలో భూములను పరిశీలించారు. అనువైన స్థలాలను చూస్తున్నట్లు వివరించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. మహమ్మదాబాద్ మండలంలో గాధిర్యాల్ గ్రామానికి గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నందున.. పుట్టాపహాడ్ నుంచి ఈ గ్రామానికి ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్థలపరిశీలనలో పాల్గొన్న అధికారులు

వరుణయాగానికి ఏర్పాట్లు

పాలమూరు (చిన్నచింతకుంట): చిన్నచింతకుంట మండలం అమ్మపూరం గ్రామ సమీపంలోని కురుమూర్తి స్వామి ఆలయంలో జూలై 1న వరుణ యాగం చేపట్టనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మూసాపేటలో తైబజారు వేలం


వేలంలో పాల్గొన్న స్థానికులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం వారంతపు సంత తైబజారు వేలం పాట నిర్వహించారు. గ్రామ ప్రత్యేకాధికారి లక్ష్మణ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి మహేందర్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన మహ్మద్ రఫీ తైబజారును రూ.2.02లక్షలకు చేజిక్కించుకున్నారు. అనంతరం గతంలో తైబజారు నిర్వాహకుడు గోరేబై, ప్రస్తుతం తైబజారు నిర్వాహకుడు మహ్మద్ రఫీలను స్థానికులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్, తాజోద్దీన్, టైలర్ కలీం, నారాయణ, సలాం తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

జడ్చర్ల: ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్ పిలుపునిచ్చారు. మొక్కలు నాటి పర్యావరణానికి పాటుపడాలని కోరుతూ ఆయన అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన పాదయాత్ర శనివారం జడ్చర్లకు చేరుకుంది. 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న విద్యాసంస్థల ప్రాంగణాలలో మొక్కలు నాటుతూ పాదయాత్రను కొనసాగిస్తున్నట్లు ఈ సందర్భంగా కృష్ణసాగర్ వివరించారు. వాయు కాలుష్యం నియంత్రణ, గ్రీన్ తెలంగాణ సాధన కోసం విద్యార్థులలో అవగాహన మరింత పెంచేందుకు తన పాదయాత్ర ఉపయోగపడుతుందన్నారు. ఆదివారం జడ్చర్లలోని అయ్యప్ప ఆలయం, వాసవీ కల్యాణ మండపం, తెలంగాణ బోటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటుతున్నట్లు వివరించారు.

యువతి అదృశ్యం

నవాబుపేట: మండల పరిధిలోని ఇప్పటూర్‌కి చెందిన శిరీష(21) వారం రోజుల నుంచి కనిపించకుండా పోయిందని పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. ఈ నెల 23న యువతి తల్లిదండ్రులు కారుకొండలో బంధువు అంత్యక్రియలకు వెళ్లారు. కాగా ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతి వారు తిరిగి వచ్చేసరికి కనిపించకుండా పోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ వివరించారు.

డీఎస్ మృతిపై సంతాపం



స్టేషన్ మహబూబ్‌నగర్: పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మృతిపై శనివారం కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో డి.శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. డి.శ్రీనివాస్ పీసీసీ అధ్యక్షుడిగా రెండుసార్లు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సాయిబాబా, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు రాములుయాదవ్, సుభాష్‌ఖత్రీ, షేక్ బాబు మియా, సంజీవ్‌కుమార్, వెంకటలక్ష్మి, ముజీబ్, ఆసిఫ్, అలీ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు



మాట్లాడుతున్న న్యాయమూర్తి ముద్దశీర్

జడ్చర్ల టౌన్: నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దశీర్ రైతులకు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఆల్వాన్‌పల్లి గ్రామంలో లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి ఎంతోమంది రైతులు మోసపోతున్నారన్నారు. రైతులు అనేక రకాలుగా మోసాలకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఏ సమస్యలు ఉన్న సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి న్యాయం పొందాలన్నారు. రైతుల చట్టాల పట్ల పూర్తి అవగాహన లేకుండా ఎన్నో ఇబ్బందులకు లోను అవుతున్నారని అన్నారు. వాటిపై అవగాహన పెంచుకుని ఎక్కడ ఏ అన్యాయం జరిగినా తక్షణం న్యాయస్థానాలను ఆశ్రయించాలని కోరారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ తాము పండించిన పంటలను సరైన ధరలకు విక్రయించుకుని లాభపడాలని రైతులకు సూచించారు. సరైన ధరలు రాకపోతే ప్రభుత్వ గిడ్డంగులలో ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవచ్చన్నారు. సదస్సులో సీఐ ఆదిరెడ్డి, న్యాయవాదులు మాలిక్‌షాకీర్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, లక్ష్మీనారాయణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చికిల్ సెల్ ఎనిమియాపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ అనిత

గండేడ్: చికిల్ సెల్ ఎనిమియాతో అనేక సమస్యలు వస్తాయని వెన్నాచేడ్ వెల్‌నెస్ సెంటర్ డాక్టర్ అనిత పేర్కొన్నారు. శనివారం మండలపరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల సల్కర్‌పేట్‌లో ఈ మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వ్యాధి జన్యుపరంగా వచ్చే అవకాశం ఉందన్నారు. దీని వల్ల ఎర్రరక్తకణాలు తగ్గి రక్తప్రసరణ తగ్గి గుండెపోటుతో పాటు ఎన్నో రుగ్మతలు వచ్చే అవకాశం ఉందన్నారు. సాధారణంగా ఎర్ర రక్త కణాలు 90 నుంచి 120 రోజుల వరకు జీవించి ఉంటాయని తెలిపారు. కానీ చికిల్ సెల్ ఎనిమియా కారణంగా వీటి సంఖ్య తగ్గి రక్తహీనతకు దారి తీస్తుందన్నారు. బాధాకరమైన నొప్పితో పాటు చేతులు కాళ్లకు వాపు వస్తుందన్నారు. తరచుగా ఇన్ఫెక్షన్లు రావడంతో పాటు యుక్త వయస్సులో పెరుగుదలలో జాప్యం, దృష్టి సమస్యలు వంటివి చోటుచేసుకుంటాయన్నారు. చిన్నపిల్లల నుంచి 40 సంవత్సరాల వరకు వయసు గల వారిలో ఈ వ్యాధి ఉండే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు గానూ నీటిని ఎక్కువగా తాగడంతో పాటు హీమోగ్లోబిన్‌కు మేలు చేసే పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. పొగ తాగడం, చల్లని లేదా అతివేడిలో బయటకు వెళ్లడం వంటివి చేయరాదని వివరించారు. డాక్టర్ సలహాలు లేకుండా ఎలాంటి మందులు వాడరాదని తెలిపారు. చికిల్ సెల్ ఎనిమియా ఉన్న మహిళలు గర్భం దాల్చాలని భావిస్తే డాక్టర్ల సలహా తప్పసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంబదాస్, ఏఎన్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి


ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్ చారి

పాలమూరు(భూత్పూర్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్ చారి సూచించారు. శనివారం మండల పరిషత్తు కార్యాలయంలో జీరో కరెంట్ బిల్లులు, గ్యాస్ కనెక్షన్లు తదితరాల కోసం ఆన్‌లైన్ చేయించుకోవడానికి ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన క్రమంలో మాట్లాడారు. ఎంపీపీ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న గ్రామస్తుల వివరాలు, ఆన్‌లైన్ నమోదు చేస్తున్న విధానం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ నమోదు సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు.

ప్రతిఒక్కరి వివరాలు నమోదు చేస్తాం: ఎంపీడీఓ..

ప్రజాపాలనలో దరఖాస్తున్న ప్రతిఒక్కరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ఎంపీడీఓ ప్రభాకర్ చారి తెలిపారు. కొన్ని రోజులుగా కార్యాలయంలో మూడు కౌంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు. దరఖాస్తు చేసుకున్న వారు కార్యాలయానికి సంబంధిత ఆధారాలతో కూడిన జిరాక్స్ కరెంట్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ బుక్, ఆధార్ కార్డు తీసుకు రావాలని వివరించారు.

మార్కెట్‌లో లావాదేవీలు నిల్..

పాలమూరు (దేవరకద్ర): దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం ఎలాంటి లావాదేవీలు కొనసాగలేదు. బుధవారం ఉల్లి వేలం తరువాత గురు, శుక్రవారాలలో కూడ టెండర్లు వేయలేదు. గడిచిన మూడు రోజుల నుంచి మార్కెట్‌కు ధాన్యం అమ్మకానికి రాకపోవడంతో లావాదేవీలు జరగలేదు. ఆదివారం సెలవు తరువాత తిరిగి సోమవారం లావాదేవీలు కొనసాగనున్నాయి.

మమ అనిపించారు

● తూతూ మంత్రంగా రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ
● గండేడ్‌లో రోడ్లపై వెళ్లే వారిని తీసుకువచ్చి కూర్చోబెట్టిన వైనం


గండేడ్‌లో సమావేశంలో పాల్గొన్న అధికారులు

గండేడ్: రైతు భరోసా అమలుపై ప్రభుత్వం చేపట్టిన అభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా మారుతోంది. ఈ మేరకు ఆయా మండలాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నా సరైన క్రమంలో సాగడం లేదు. గండేడ్ మండల కేంద్రంలో శనివారం జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ బాలయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదిత తదితరుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. అయితే కార్యక్రమం తూతూ మంత్రంగా ముగిసింది. కొద్దిమంది రైతులతోనే మమ అనిపించారు. ఉమ్మడి మండలంలోని 49 గ్రామాల రైతులకు సమాచారం ఇవ్వాల్సి ఉన్నా పీఏసీఎస్ వారు నిర్లక్ష్యం ప్రదర్శించారు. కేవలం పదుల సంఖ్యలో రైతులతో సమావేశం నిర్వహించారు. పైపెచ్చు రైతులు కాకుండా మండల కేంద్రానికి ఆయా పనుల మీద వచ్చిన వారిని అప్పటికప్పుడు పిలిపించి సమావేశంలో కూర్చోబెట్టినట్లు తెలిసింది. అందులో భూమి అప్పులేని వారు సైతం ఉండడం గమనార్హం. ఏదో ఫార్మాలిటీ అన్నట్లుగా వచ్చిన వారితో సంతకాలు, అభిప్రాయాలు తీసుకున్నారు. కొందరు ఏమిటో అర్థంకాక మిన్నకుండి పోయారు. విషయమై గండేడ్ సీఈఓ ఆశన్నను వివరణ కోరగా తమకు శుక్రవారం సాయంత్రమే సమాచారం ఇచ్చారని అన్ని గ్రామాల డైరెక్టర్లకు, మాజీ సర్పంచులకు సమాచారం ఇచ్చామన్నారు. ఇదిలా ఉండగా సమావేశానికి వచ్చినవారు మాత్రం ఎవరికీ సమాచారం ఇవ్వలేదని అప్పటికప్పుడు తీసుకువచ్చారని చెప్పడం గమనార్హం.

సకాలంలో అందజేయాలి

జడ్చర్ల: రైతు భరోసాకి సంబంధించి శనివారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో అభిప్రాయ సేకరణ చేశారు. కాగా రైతులు మాట్లాడుతూ ప్రతి సీజన్‌కు సకాలంలో సాయం అందజేయాలని కోరారు. అదేవిధంగా 10 ఎకరాలకు సాయం పరిమితం చేస్తే బాగుంటుందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ సుదర్శన్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ కిసాన్ ఖేత్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 ఎకరాల వరకు ఇవ్వాలి

నవాబుపేట: మండల కేంద్రంలో పీఏసీఎస్ ద్వారా చైర్మన్ నర్సింహులు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశం హాజరై మాట్లాడారు. కాగా చాలా మంది రైతులు 10 ఎకరాల వరకు రైతుభరోసా వర్తింప చేయాలని సూచించారు. అదేవిధంగా సాగుచేసిన భూమికి మాత్రమే వర్తింపచేయాలన్నారు. అందుకోసం క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్, నర్సిములు, సీఈఓ హన్మంతు, డైరెక్టర్లు వెంకటేష్, శశిధర్‌రెడ్డి, అంజయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

సాగుచేసే వారందరికీ వర్తింపజేయాలి


మిడ్జిల్‌లో..

మిడ్జిల్: మండల కేంద్రంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథితులుగా జిల్లా సహకార శాఖ అధికారి పద్మ, వ్యవసాయ అధికారి వెంకటేశం పాల్గొన్నారు. కాగా పంటలు సాగు చేసిన ప్రతిఒక్కరికీ భరోసా వర్తింపజేయాలని రైతులు సూచించారు. వైస్ చైర్మన్ అల్వాల్ రెడ్డి, మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, సహాయ సంచాలకులు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

పాలమూరు (దేవరకద్ర): కౌకుంట్ల మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకులో పని చేసే ఫీల్డ్ ఆఫీసర్ మాధవరెడ్డి బదిలీ కావడంతో.. శనివారం బ్యాంకులో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ నాయకులు, ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. నాయకులు తుమ్మల శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, అచ్యుతారెడ్డి, గొల్లసాయన్న, అచ్చిరెడ్డి, మహేశ్ రెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com